# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 4, డిసెంబర్ 2025


## మహిళల రక్షణ, భద్రత కోసం మఫ్టీలో షీ టీమ్స్ నిఘా

### సోషల్ మీడియా మధ్యమాల పట్ల జాగ్రత్తగా ఉండాలి : సీపీ అంబర్ కిషోర్ ఝా



మంచిర్యాల, డిసెంబర్ 3, ప్రభాతవార్త

మహిళలు, యువతుల రక్షణ కోసమే షీటీం ఉందని, మహిళల రక్షణ, భద్రత పోలీసు బాధ్యతలో భాగంగా రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో షీ టీమ్స్ స్కూల్, కళాశాలలు, ఆఫీస్‌లు ముగిసే సమయానికి స్కూల్స్, కళాశాల, బస్టాండ్ ప్రధాన కూడళ్ళ వద్ద ఎక్కువగా బాలికలు, మహిళలు ప్రయాణాలు చేసే సమయంలో వారిని ఏవైనా ఇబ్బందులు పెడుతున్నారా అని క్షేత్ర స్థాయిలో ప్రజల మధ్య సాధారణ జనాల వలె మఫ్టీలో ఉంటూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. మహిళల రక్షణ కోసమే షీటీం పని చేస్తుందని, కమిషనరేట్ పరిధిలో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో కేసు, గుడచ్, బ్యాడ్ టచ్, ఆత్మహత్యలు, డ్రగ్స్, బాల్య వివాహాలు, మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. సమస్య వచ్చినప్పుడు 100కు డయల్ చేస్తే తక్షణమే స్పందిస్తామన్నారు. టీ సేఫ్ యాప్, మహిళల భద్రత, రక్షణ చర్యలు, తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాల ద్వారా చైతన్య పరుస్తున్నామని వివరించారు. షీ టీమ్ సభ్యులు ప్రత్యక్షంగా ఫిర్యాదులు తీసుకుంటారని, లేదా ఆన్లైన్ క్యూఆర్ కోడ్, వాట్సాప్ ద్వారా కూడా స్వీకరిస్తామన్నారు. ఎవరైనా వేధింపులు, అసభ్య ప్రవర్తన, మాట్లాడడం వంటి సమస్యలు ఎదురైతే వెంటనే ధైర్యంగా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. బాలికలు, మహిళలు ఎక్కడ మిగతా 2లో..

## దివ్యాంగులు తమ అన్ని హక్కులను పొందాలి

### ★ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ పట్టణం, డిసెంబర్ 03, ప్రభాతవార్త

దివ్యాంగులు తమకు ఉన్న హక్కులన్నింటినీ పొందాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని టీఎన్జీవో భవనంలో నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దివ్యాంగుల సంక్షేమం కొరకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దివ్యాంగులకు ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో ప్రవేశాలలో రిజర్వేషన్లను ఉపయోగించుకోవాలన్నారు. అన్ని మిగతా 2లో..



## పశువుల పాక.. చెట్టు నీడలే.. చదువుకు దిక్కు..!



- ★ రాష్ట్రం మారినా తలరాతలు మారలే..!
- ★ మారుమూల మండలాన్ని పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు
- ★ గిరిజన విద్యపై నిర్లక్ష్యపు నీడలు ఎందుకు..?
- ★ డిజిటల్ కాలంలోనూ ఆదివాసీ పిల్లలకు అన్యాయమే



బెజ్జూర్, డిసెంబర్ 3, ప్రభాతవార్త

బెజ్జూర్ మండలంలోని పాత సోమిని అనే ఆదివాసి గ్రామం ఈ డిజిటల్ కాలంలోనూ అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఇక్కడ విద్యనభ్యస్తున్న విద్యార్థులు పాఠశాల భవనం లేక ఎన్నో అవస్థలు పడుతున్నారు. బాలల భవితవ్యం పశువుల పాక చెట్టు నీడలే నిర్ణయిస్తున్నాయి. గ్రామంలో ఉన్న టీడబ్ల్యూపిఎస్ పాఠశాల గత ఎనిమిది సంవత్సరాల నుండి పాడుబడి కూలే స్థితిలో ఉంది. దీంతో గత్యంతరం లేక ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులు గ్రామంలోని ఒక పశువుల పాకలో విద్యార్థులకు విద్యను బోధిస్తున్నారు. వర్షాకాలంలో అది రాత్రంతా పశువుల ఆవాసం. ఉదయం నుండి సాయంత్రం వరకు పిల్లల బడిగా పనిచేస్తుంది. మిగతా కాలాల్లో పాక బయట ఉన్న చెట్టు కింద విద్యార్థులకు పాఠాలను బోధిస్తున్నారు. ఈ డిజిటల్ కాలంలోనూ విద్యార్థులకు పశువుల పాక, చెట్టు మిగతా 2లో..

### ప్రభుత్వ యంత్రాంగం కదిలింది..

## మైదానం మళ్లీ మెరిసింది

మంచిర్యాల, డిసెంబర్ 3, ప్రభాతవార్త

మైదానం ఇలా క్రీడాభివృద్ధి ఎలా..? అంటూ గత శుక్రవారం వార్త పత్రికలో ప్రచురితమైన వార్తకు ప్రభుత్వ యంత్రాంగం స్పందించింది. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నడిబొడ్డున గల బాలుర ఉన్నత పాఠశాలలో ఉన్న పాత క్రీడా మైదానం చెత్తకుప్పలా మారిపోయిన దృశ్యం పత్రికల్లో కనిపించగానే, అధికారులు అలారం మోగించారు. అంతకుముందు చెత్తా చెదారం, ప్లాస్టిక్ కవర్లూ, రాళ్లూ రప్పలుగా కనిపించిన ఆ మైదానం, వార్త కథనం అనంతరం బ్లేడ్ ట్రాక్టర్‌తో శుభ్రం చేశారు. అదేవిధంగా మరుగుదొడ్ల పైన కూడా ప్రత్యేకమైన చర్య చేపట్టి నీటి వసతి కల్పించాలని పలువురు క్రీడాకారులు కోరుతున్నారు. ఉదయం సాయంత్రానికి మైదానంలోకి అడుగుపెట్టిన యువ క్రీడాకారులు ఆనందంలో మునిగిపోయారు. విమర్శే వేగం తెచ్చిందని, ప్రభుత్వం ఈసారి ఆలస్యం చేయలేదని ప్రజలు మెచ్చుకుంటున్నారు.






సిర్పూర్ (టి), డిసెంబర్ 3, ప్రభాతవార్త:

హై స్కూల్ హెడ్మాస్టర్‌గా ఎస్.జి.టి అని శీర్షిక నా అక్టోబర్ 23న ప్రభాతవార్తలో ప్రచురితమైన కథనంపై జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి స్పందించి ఫుల్ అడిషనల్ చార్జ్ హెడ్మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్జిటి ఉపాధ్యాయురాలిని హెడ్మాస్టర్ బాధ్యతల నుంచి తప్పించి అదే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న స్కూల్ అసిస్టెంట్ కన్నయ్యకు ఎఫ్.ఎ.సి హెడ్మాస్టర్‌గా అదనపు బాధ్యతలను ఇవ్వడం జరిగింది. ప్రభాతవార్త ప్రచురించిన కథనంపై విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.



హైస్కూల్ హెడ్‌మాస్టర్‌గా..

ఎస్జీటీ...?

- వార్డెన్‌గా వాచ్‌మెన్..
- నిబంధనలకు విరుద్ధంగా నియామకం చేసిన అధికారులు
- సిర్పూర్ (టీ) ఆశ్రమ పాఠశాల (బాలిక)లో విధులు నిర్వహణ
- గిరిజన విద్యపై నిర్లక్ష్య ధోరణిలో అధికారులు

సిర్పూర్ (టి), అక్టోబర్ 22, ప్రభాతవార్త

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ (టి) మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పీజీహెచ్ఎం మంజూరు ఉన్నచోట హైస్కూల్‌లో ఒక ఎస్జీటీకి ఇన్చార్జి హెడ్‌మాస్టర్‌గా ఫుల్ అడిషనల్ చార్జ్‌గా బాధ్యతలను జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి బాధ్యతలు ఇచ్చారు. ఇదిలా ఉంటే వార్డెన్ మంజూరు ఉన్న పోస్టులో వాచ్‌మెన్‌ను ఇన్చార్జి డిప్యూటీ వార్డెన్‌గా బాధ్యతలను అప్పజెప్పారు. గిరిజన విద్యార్థుల పట్ల, గిరిజన విద్యా పట్ల అధికారులకు ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతుంది. నిబంధనలకు విరుద్ధంగా వీరిని నియమించడం ఎంతవరకు సమంజసమని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. 2లో..

# దివ్యాంగులు తమ అన్ని హక్కులను పొందాలి

(మొదటిపేజీ తరువాయి)

రంగాలలో ఉన్నతి సాధించాలన్నారు. జిల్లా కేంద్రంలో దివ్యాంగులకు ప్రత్యేకంగా కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాయితీ రుణాలు పొంది వ్యాపారాలలో రాణించాలని వివరించారు. జిల్లాలోని అన్ని కార్యాలయాలలో దివ్యాంగులకు సౌకర్యవంతంగా ఉండేలా అన్ని వసతులు కల్పించామని అన్నారు. దివ్యాంగులకు ప్రత్యేకంగా భవిత కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. జిల్లాలో ఇప్పటికే 10 భవిత కేంద్రాలను అత్యంత ఆధునీకంగా నిర్వహిస్తున్నామని, ముున్ముందు మరిన్ని భవిత కేంద్రాలను ఆధునీకరించడంతోపాటు, ఫిజియోథెరపిస్టలను అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు. అర్హులైన దివ్యాంగులకు యుడిఐడి కార్డులను అందిస్తున్నట్లు వివరించారు. దివ్యాంగుల హక్కుల గురించి అవగాహన కలిగేలా న్యాయ నిపుణులు, ఎన్జీవోలతో కలిసి ప్రత్యేక వర్క్ షాప్ ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. దివ్యాంగులకు ఎటువంటి సమస్యలు ఉన్న పరిష్కరించేలా చర్యలు చేపడతామని తెలిపారు. దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని, దివ్యాంగులకు ఇటీవలి నిర్వహించిన క్రీడ పోటీలలో ప్రతిభ కనబరిచిన దివ్యాంగులకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. పలువురు దివ్యాంగులు కలెక్టర్, అధికారులను శాలువాలతో సన్మానించి, పూల మొక్కలను అందించారు.. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఎల్ఎస్ఎ సెక్రటరీ రాధిక, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిఈఓ భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, దివ్యాంగులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కార్యచరణ ప్రకారం సెలవులు ఖరారు

## - మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, డిసెంబర్ 3, ప్రభాతవార్త

2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పోలింగ్ కార్యచరణ ప్రకారం సెలవులు ఖరారు చేయడం జరిగిందని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ సంస్థలకు పోలింగ్ రోజు ప్రభుత్వ సెలవుగా ప్రకటించడం జరిగిందని, తమ ఓటు హక్కును వినియోగించుకోవాలనుకునే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, సేవల అత్యవసరతకు లోబడి ఆ రోజు కార్యాలయానికి ఆలస్యంగా హాజరు కావడం / కార్యాలయం నుండి త్వరగా వెళ్లడం / తక్కువ వ్యవధి గైర్హాజరు విధానాన్ని ఉపయోగించుకునే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. ఎన్నికల కోసం ఉపయోగించబోయే ప్రజా భవనాలు, విద్యా సంస్థల భవనాలు, ఇతర భవనాలకు పోలింగ్ రోజు ప్రభుత్వ సెలవు , పోలింగ్ రోజుకు ముందు రోజు స్థానిక సెలవుగా పరిగణించబడుతుందని, దండేపల్లి, హాజీపూర్, జన్నారం, లక్షెట్టిపేట మండలాలకు ఈ నెల 10వ తేదీ (పోలింగ్ ముందు రోజు స్థానిక సెలవు దినం), 11వ తేదీ (పోలింగ్ రోజు), బెల్లంపల్లి, భీమిని, కన్నేపల్లి, కాసిపేట, నెన్నెల, తాండూర్, వేమనపల్లి మండలాలకు ఈ నెల 13వ తేదీ (పోలింగ్ ముందు రోజు స్థానిక సెలవు దినం), 14వ తేదీ (పోలింగ్ రోజు), భీమారం, జైపూర్, చెన్నూరు, కోటపల్లి, మందమర్రి మండలాలకు ఈ నెల 16వ తేదీ (పోలింగ్ ముందు రోజు స్థానిక సెలవు దినం), 17వ తేదీ (పోలింగ్ రోజు)లలో సెలవు దినంగా ప్రకటించడం జరిగిందని తెలిపారు. తెలిపారు. ప్రకటించిన ప్రాంతాలలోని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు/సంస్థల ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ రోజు స్థానిక సెలవు ప్రకటించబడిందని తెలిపారు. ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో ఉన్న సంబంధిత అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు/వ్యాపార/పరిశ్రమ యాజమాన్యాలు తమ ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు పై పేర్కొన్న రోజులను వేతనంతో కూడిన సెలవుగా ప్రకటించాలని తెలిపారు.





విద్యను అభ్యసిస్తున్న పశువుల పాక



సమస్యను తెలుపుతున్న గ్రామస్తులు

# పశువుల పాక.. చెట్టు నీడలే.. చదువుకు దిక్కు..!

(మొదటిపేజీ తరువాయి)

నీడలే పాఠశాలలయ్యాయి. ఇక్కడ చదువంటే పిల్లలకు పర్యావరణంతో సావాసమే. పశువుల పాకలోనైనా, చెట్టు కిందైనా పిల్లలు చాప వేసుకుని కూర్చోవాల్సిందే. తాము ఏం తప్పు చేశామని తమ పిల్లలు ఇలాంటి దుస్థితిని అనుభవించాల్సి వస్తోందని అక్కడి గిరిజన ఆదివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ తాతలు, ముత్తాతల నుంచి ఇక్కడనే నివసిస్తున్నామని అయినప్పటికీ తమను అధికారులు ప్రజా ప్రతినిధులు ఎవరు పట్టించుకోవడంలేదని వాపోయారు. సమస్యను స్థానిక నాయకులకు అధికారులకు పలుమార్లు విన్నవించామని సమస్య పరిష్కారంకు కృషి చేస్తామని వారు తెలిపినప్పటికీ ఇప్పటివరకు కూడా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆసిఫాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు నైతం రాజు పాఠశాలను సందర్శించి విద్యార్థులతో, గ్రామస్తులతో సమస్యలు తెలుసుకున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల భవనం మంజూరు చేసి ఆదుకోవాలని వేడుకున్నారు.







# సిరికొండలో సర్పంచ్ ఎన్నికల హోరాహోరీ పోటీ

## - ముగ్గురు అభ్యర్థులతో రాజకీయ పండుగ వాతావరణం

సిరికొండ, డిసెంబర్ 03, ప్రభాతవార్త:

సిరికొండ మండలంలో ఈ నెల 11న మొదటి విడత సర్పంచ్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మండలం మొత్తం ఎన్నికల వేడితో కళకళలాడుతోంది. అభ్యర్థులకు ఎన్నికల గుర్తులు కేటాయించడంతో సర్పంచ్, వార్డు సభ్యుల ప్రచారం మరో మెట్టు దాటింది. గ్రామంలో ప్రతి వీధి, ప్రతి చౌరస్తా రాజకీయ సందడితో రసరమ్యంగా మారింది. ఈసారి సిరికొండ సర్పంచ్ పీఠం కోసం త్రిముఖ పోటీ నెలకొంది. ఒరగంటి పెంటన్న, కత్తర్ల మహేష్, బొడ్డు దత్తు అనే ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలిచారు. ప్రతిఒక్కరూ తమకు అనుకూలంగా ఓటర్లను ఆకర్షించడానికి ప్రత్యేక రణతంత్రాలు రూపొందించారు. ఇంటింటి ప్రచారం, వ్యక్తిగత మట్లాడుట, అభివృద్ధి హామీలు ప్రధానంగా కొనసాగుతున్నాయి. ప్రచారంలో సంప్రదాయ పద్ధతులతో పాటు ఆధునిక పద్ధతులు కూడా వినియోగంలోకి వచ్చాయి. బ్యానర్లు, పోస్టర్లు, భారీ ఊరేగింపులు గ్రామంలో ఉత్సవ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. సోషల్ మీడియా కూడా ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తోంది. ప్రతి అభ్యర్థి తన కార్యకర్తలను ఉపయోగించి డిజిటల్ ప్రచారంపై దృష్టి పెట్టాడు. గ్రామంలో పెద్దలు, యువత, మహిళలను లక్ష్యం చేసుకొని ప్రత్యేక ప్రచార బృందాలు ఏర్పడ్డాయి. గ్రామాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రతి అభ్యర్థి ఓటర్లను నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నాడు. తాగునీరు, రహదారులు, డ్రైనేజ్, భూముల సమస్యలు, గ్రామ శుభ్రత వంటి అంశాలు ప్రచారంలో ప్రధాన చర్చగా నిలుస్తున్నాయి. సిరికొండ భవిష్యత్తు దిశను మార్చగల నాయకత్వం ఎవరిదన్న దానిపై గ్రామస్తుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ ప్రచారం మరింత వేగం పందుకునే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సిరికొండ సర్పంచ్ పీఠంపై ఎవరు అధిష్టించబోతారో మరో కొన్ని రోజుల్లో తేలనుంది.

# కారుణ్య నియామకాల్లో పారదర్శకత కోసమే వైఎంప్లాయ్ విధానం

## - వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన జీఎం కవితా నాయుడు

నస్పూర్, డిసెంబర్ 03, ప్రభాతవార్త



సింగరేణిలో కారుణ్య, వారసత్వ ఉద్యోగ నియామకాలను మరింత పారదర్శకంగా, వేగంగా చేపట్టేందుకు నూతనంగా ప్రీ-హైరింగ్ అప్లికేషన్‌చ (టీకోడ్: వైఎంప్లాయ్) ను రూపొందించినట్లు జనరల్ మేనేజర్ (పర్సనల్, ఐ.ఆర్ అండ్ పి.ఎం) కవితా నాయుడు తెలిపారు. బుధవారం సింగరేణి ప్రధాన కార్యాలయం నుండి సిబ్బంది విభాగం (పర్సనల్) అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం కవితా నాయుడు మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాలను నిర్వహించడానికి రూపొందించిన ఈ డిజిటల్ అప్లికేషన్ ద్వారా క్షేత్ర స్థాయిలో దరఖాస్తులు స్వీకరించడం నుండి సాప్ హెచ్ఆర్ బృందం ద్వారా తుది నియామక ఉత్తర్వులు ఇచ్చే వరకు ప్రక్రియ అంతా సులభతరం అవుతుందన్నారు. ఈ విధానం ద్వారా వివరాల నమోదు, పరిశీలన, నియామక స్థానం కేటాయింపు వంటి అన్ని దశల్లో పారదర్శకత ఉంటుందని, కాలయాపన లేకుండా సకాలంలో పనులు పూర్తవుతాయని, పత్రాల నిర్వహణ ప్రామాణికంగా ఉంటుందని పేర్కొన్నారు. మాజీ ఉద్యోగి వివరాల నమోదు, ధృవీకరణ, ప్రాథమిక వైద్య పరీక్ష, పుట్టిన తేదీ నిర్ధారణ, ఓఎస్ఎల్ వివరాలు పంపడం, ఓఎస్ఎల్ చేరిక, పోస్టింగ్ వివరాలు, విధుల్లో చేరే ప్రక్రియ, హెచ్ఆర్ సమీక్ష, తుది నియామకం.. ఇలా అన్ని దశలు ఈ యాప్ ద్వారానే జరుగుతాయని వివరించారు. అలాగే, ఒప్పంద కార్మికుల ఈ.ఎస్.ఐ వివరాల నమోదు ప్రక్రియను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, డిప్యూటీ పిఎంలు ఎం. రాజేష్, జి.కె. కిరణ్ కుమార్, సీనియర్ పి.ఓ.లు ఎస్. సురేందర్, బి. మురళీ, ప్రశాంత్, సంక్షేమ అధికారులు, వివిధ గనుల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణ, భద్రత కోసం మఫ్టీలో షీ టీమ్స్ నిఘా

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నా భద్రతగా ఉండటం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత. పోలీసు శాఖ మీకు అండగా ఉంటుందని, మీ భద్రత కోసం 24 గంటలు సిద్ధంగా ఉన్నామని, తప్పు చేస్తున్న వారి మీద చర్య తీసుకోవడానికి మీ సమాచారమే వారిపై చట్ట పరమైన చర్యలకు ఆధారం అన్నారు. మహిళలు అత్యవసర పరిస్థితులలో రామగుండం పోలీస్ కమిషనరేట్ షీ టీం నెంబర్ 6303923700, పెద్దపల్లి జోన్ షీ టీమ్ నెంబర్ 8712659386 మంచిర్యాల జోన్ షీ టీమ్ నెంబర్ 8712659386 కి కాల్ చేసి, వాట్సాప్ ద్వారా సందేశం పంపించి లేదా డయల్ 100 కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సీపీ సూచించారు. నవంబర్-2025 నెలలో రామగుండం కమిషనరేట్ షీ టీమ్స్ వద్ద మొత్తం పిటిషన్లు మొత్తం 68 పిటిషన్లలో 15 పిటిషన్లు రామగుండం షీ టీం వాట్సాప్ నంబర్ ద్వారా మరియు ప్రత్యక్షంగా షీ టీమ్స్ రామగుండం (పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలు) కార్యాలయాలకు ఇవ్వబడినవి. 53 - రెడ్ హ్యాండెడ్ పిటిషన్‌లు ఈ 15 పిటిషన్లలో ఎఫ్ఐఆర్ 04, పెట్టీకేసులు 04, కౌన్సిలింగ్ నిర్వహణ 02, హెచ్చరించి వదిలివేసినవి 05 ,అలాగే షీ టీమ్స్ పెద్దపల్లి మంచిర్యాల జిల్లాల్లో పబ్లిక్ ఉండే ప్రాంతాలు, పార్కులు, షాపింగ్ మాల్ ప్రాంతాల్లో డీకాయ్ ఆపరేషన్లు నిర్వహించి మొత్తం 60 మంది ఆఖతాయిలను పట్టుకుని పెట్టీకేసులు నమోదు చేసి, తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ చేసి హెచ్చరించడం జరిగిందని తెలిపారు. మొత్తం 53 రెడ్ హ్యాండెడ్ కేసుల్లోపెట్టీకేసులు 05, కౌన్సిలింగ్ 26, హెచ్చరించి వదిలివేయడం 22 కాగా, నవంబర్-2025 లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు, పెద్దపల్లి జిల్లా 29, మంచిర్యాల జిల్లా 34, మొత్తం 63 అని, నవంబర్2025 లో సందర్శించిన హాట్ స్పాట్స్ పెద్దపల్లి జిల్లా 117, మంచిర్యాల జిల్లా 115, మొత్తం 232 అని తెలిపారు.



భట్టుపల్లి నామినేషన్ స్వీకరణ కేంద్రం వద్ద సీఐ కుమారస్వామి

## నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలించిన రూరల్ సీఐ

**కాగజ్‌నగర్, డిసెంబర్ 3, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ స్వీకరణ కేంద్రాలను కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమారస్వామి పరిశీలించారు. మండలంలోని భట్టుపల్లితో పాటు ఆయా నామినేషన్ కేంద్రాలను పరిశీలించి అక్కడ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు చేశారు. నామినేషన్ వేయడానికి అభ్యర్థితోపాటు ఇద్దరుమద్దతుదారులకు మాత్రమే నామినేషన్ కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని చెప్పారు. అధికారుల నుంచి అభ్యర్థులు ర్యాలీలు, సమావేశాలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. లేకపోతేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీఐ వెంట, ఎస్సై, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ముగిసిన నామినేషన్ల పరిశీలన

**తాండూర్, డిసెంబర్ 3, ప్రభాతవార్త :**

రెండో విడత సర్పంచ్, వార్డు స్థానాల అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన బుధవారం ముగిసింది. మండలంలో సర్పంచ్, వార్డు స్థానాలకు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్, సహాయ అధికారులు పరిశీలించారు. ఎన్నికల నిబంధనలకు అనుకూలంగా లేని కొందరు అభ్యర్థల నామినేషన్లను అధికారులు తీరస్కరించారు. నామినేషన్లు పరిశీలిన అనంతరం 15 సర్పంచ్ స్థానాలకు 83 మంది, 144 వార్డు స్థానాలకు 370 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. ఈ నెల 6న అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహారణ గడువు ముగిసిన అనంతరం బరిలో ఉండే అభ్యర్థుల తుది జాబితాను ఎన్నికల అధికారులు ప్రకటించనున్నారు.



## సుదర్శన్‌రెడ్డిను సన్మానించిన పత్తిరెడ్డి

**సారంగాపూర్, డిసెంబర్ 03, ప్రభాతవార్త**

ప్రజా పాలన వారోత్సవం నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్‌రెడ్డి బుధవారం నిర్మల్ నుంచి బయలుదేరారు. ఈ సందర్భంగా నిర్మల్ కలెక్టరేట్ వద్ద జడ్పీటీసీ ఫోరమ్ అధ్యక్షుడు పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి సుదర్శన్ రెడ్డికు శాలువా కప్పి సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మాజీ డిసిసి అధ్యక్షుడు కూచడి శ్రీహరిరావు, పిఏసిఎస్ అధ్యక్షుడు రమణరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు గంగ్రత్ ఈశ్వర్, అప్పల గణేష్, కీజార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## యూరియా తిప్పలు

**బజార్‌హత్నూర్, డిసెంబర్ 03, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సంఘంలో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రబీ సీజన్లో కూడా యూరియా లభించక, రైతులు వేకువజాము నుంచే సొసైటీల ముందు బారులు తీరుతున్నారు. యూరియా సకాలంలో లభించకపోవడం, రబీ సీజన్లో కూడా సరఫరాలో ఇబ్బందులు ఉండి, పంపిణీ వ్యవస్థ కూడ సక్రమంగా లేకపోవడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

# నామినేషన్ పత్రాలను నిబంధనలకు లోబడి పరిశీలించాలి

### - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**బెల్లంపల్లి, డిసెంబర్ 03, ప్రభాతవార్త**



రాష్ట్రంలో 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో నామినేషన్ పత్రాలను నిబంధనలకు లోబడి పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని బెల్లంపల్లి మండలంలోని బూదకుర్ద్, చాకేపల్లి గ్రామాలకు బూదకుర్ద్ గ్రామపంచాయతీలో నామినేషన్ల పరిశీలన ప్రక్రియను మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహేందర్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులు సమర్పించిన పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి క్షుణ్ణంగా పరిశీలించాలని, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. నామినేషన్ ప్రక్రియ నుండి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్, నామినేషన్ల పరిశీలన, పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఫోటో ఓటర్ స్లిప్పుల పంపిణీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, ఓటింగ్ నిర్వహణ ప్రక్రియ, ఫలితాలు వంటి ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నామినేషన్లు పరిశీలించి అర్హులు, అనర్హుల జాబితా పూర్తి వివరాలతో రూపొందించాలని తెలిపారు. ఎన్నికల గుర్తుల కేటాయింపులో జాగ్రత్త వహించాలని, విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. అంతకు ముందు బెల్లంపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యాలయం పరిధిలో చేపట్టిన అదనపు గదుల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రభుత్వం విద్యాసంస్థలను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



పులి పాద ముద్రలు



పులి అడుగుజాడలను గుర్తిస్తున్న ఫారెస్ట్ అధికారులు

## పెగడపల్లి సెక్షన్ అడవిలో పులి సంచారం

### - ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**జైపూర్, డిసెంబర్ 03, ప్రభాతవార్త**

మండలంలోని పెగడపల్లి సెక్షన్ అడవిలో పెద్దపులి సంచరిస్తుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు బుధవారం ప్రకటించారు. అటవీ శాఖ అధికారులు తెలిపిన సమాచారం మేరకు పెగడపల్లి సెక్షన్ పరిధిలోని పెగడపల్లి, గంగిపల్లి, నర్సింగాపూర్, మద్దులపల్ల, కుందారం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అటవీ ప్రాంతల్లో పొలం పనులు చేసుకునేవారు, పశువుల కాపరులు 4 గంటల వరకు ఇంటికి చేరుకోవాలని హెచ్చరించారు. పంట పొలం చుట్టూ కరెంటు, ఉచ్చులు ఏర్పాటు చేయరాదని అన్నారు. ఎవరైన పులి పాద ముద్రలు గుర్తిస్తే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## హార్వెస్టర్ ఢీకొని ఒకరు మృతి, మరొకరికి గాయాలు

**లక్షెట్టిపేట, డిసెంబర్ 03, ప్రభాతవార్త**



లక్సెట్టిపేట మండలం దౌడేపల్లి శివారులోని ముత్తే బుచ్చయ్య పల్లె గ్రామ సమీపంలో నిన్న సాయంత్రం హార్వెస్టర్ ఢీకొని బలరావుపేట గ్రామానికి చెందిన దుర్గం మల్లేష్ (48) అక్కడికక్కడే మృతి చెందగా, మెంగని మధుకర్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి అని ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మృతుడు మల్లేష్ మధుకర్ని బైక్ పై ఎక్కించుకొని కోర్విచల్మా గ్రామంలో బంధువుల ఇంటికి వెళ్లి బాకీ ఉన్న డబ్బుల నుండి కొంత డబ్బు అప్పగించి వస్తుండగా ముత్తే బుచ్చయ్య పల్లె వద్ద హార్వెస్టర్ వాహన డ్రైవర్ తన వాహనాన్ని సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనకాల ఉన్న వీరు ఇరువురు బైక్ను ఆపగా హార్వెస్టర్ డ్రైవర్ తన వాహనాన్ని నిరక్ష్యంగా రివర్స్ తీసుకురాగా ఈ ప్రమాదం జరిగింది. మృతుని కొడుకు దుర్గం సాయికిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయడం జరుగుతుందని తెలిపారు.

## పెద్దపులి కదలికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**పెంచికల్ పేట్, డిసెంబర్ 03, ప్రభాతవార్త:**

ఎల్లూర్, పెంచికల్ పేట్ గ్రామ పరిసర, పెద్దవాగు పరివాహక ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం పొలాలకు వెళ్లే రైతులు పులి పాదముద్రలు గమనించి అనుమానంతో ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకున్న ఫారెస్ట్ అధికారులు పెద్దపులి పాదముద్రలుగా నిర్ధారించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఒంటరిగా పత్తి చేలకు, పొలం పనులకు వెళ్లకూడదని గుంపులుగా మాత్రమే వెళ్లాలని సూచించారు. పశువుల కాపరులు అడవి ప్రాంతాలకు వెళ్లకుండా అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఉదయం సాయంత్రం చీకటి పడకముందే ఇంటికి చేరుకోవాలని తెలిపారు. పులి సంచారం పూర్తిగా నియంత్రణలోకి వచ్చే వరకు గ్రామా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

## దహెగాంలో పులి సంచారం

**దహెగాం, డిసెంబర్ 3,ప్రభాతవార్త :**

దహెగాంలోని లగ్గం, ఒడ్డుగూడ గ్రామాల శివారులో పులి అడుగులు గుర్తించమని పులి సంచారం చేస్తుందని ఎవరు కూడా పత్తి ఎరడానికి ఒంటరిగా చేన్లకు వెళ్ళవద్దని గుంపుగుంపులుగా వెళ్లాలని ఫారెస్ట్ అధికారులు తెలియజేసారు. గ్రామాలలోని ప్రజలకు అవగాహనా కల్పించారు. ఎఫ్ ఎస్ వో లు సద్దాం హుస్సేన్,రవి ఎఫ్‌బివోలు అస్మా,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ అధికారులు

# సీఎం బేషరతుగా క్షమాపణలు చెప్పాలి

* బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యాల ఏమాజీ * బిజెపి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం





**తాండూర్, డిసెంబర్ 3, ప్రభాతవార్త :**

హిందూ దేవుళ్ళ పట్ల సీఎం రేవంత్ రెడ్డి చేసిన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని వెంటనే బేషరతుగా క్షమాపణలు చెప్పాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యాల ఏమాజీ డిమాండ్ చేశారు. సీఎం వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలోని ఐబి జాతీయ రహదారిపై బుధవారం బిజెపి నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వర్గం ప్రజల మన్ననలు పొందెందుకే సీఎం హిందూ దేవుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసి మనోభావాలను దెబ్బతీశాడని ఫైర్ అయ్యారు. గతంలో హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేసిన మాజీ సీఎం బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు పట్టిన గతే రేవంత్ రెడ్డికి పడుతుందని అన్నారు. సీఎం వ్యాఖ్యలను ప్రతి హిందువు ఖండించి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, నాయకులు పులగం తిరుపతి, శేషగిరి, పుట్ట కుమార్, శ్రావణ్, ఏముర్ల ప్రదీప్, నర్సింగ్, కొండ రవి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

**మంచిర్యాల, డిసెంబర్ 3, ప్రభాతవార్త**

మంగళవారం రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి హిందూ దేవి దేవతలపై చేసిన అనుచిత వాక్యలకు నిరసనగా బుధవారం రోజు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మంచిర్యాల కార్పొరేషన్ గర్మిళ్ల జోన్ అధ్యక్షులు అమీరి శెట్టి రాజుకుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ దేవి దేవతలపై హిందూ సమాజంపై చేసిన వాక్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రేవంత్ రెడ్డి మీరు ఎన్నికల ప్రచారంలో దేవుళ్ళ మీద ఒట్టు పెట్టి అనేక హామీలు ఇస్తామని చెప్పడం మర్చిపోయారా అని అన్నారు. హిందూ సమాజం అన్నా హిందూ దేవులన్న ముఖ్యమంత్రి కి చిన్న చూపు అయ్యిందన్నారు. ముస్లిం వర్గాలను గాని క్రిస్టియన్ వర్గాలను గాని ఈ విధంగా హిందూ సమాజం మీద మాట్లాడినట్టు అవహేళనగా మాట్లాడగలరా, అంత ధైర్యం మీకుందా అని ప్రశ్నించారు. 6 గ్యారంటీలు అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాకా, మీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే భారతీయ జనతా పార్టీ చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. మీ వ్యాఖ్యలను పాలనను ప్రజలందరూ గమనిస్తున్నారని రాబోయే ఎన్నికల్లో మీకు తగిన గుణపాఠం చెప్తారని ఆయన అన్నారు. ఖబర్దార్ రేవంత్ రెడ్డి ఇకముందు మీరు ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేస్తే రాష్ట్రంలో ఏ గుళ్లో మిమ్మల్ని అడుగుపెట్టనీయమని భారతీయ జనతా పార్టీ తరఫున హెచ్చరిస్తున్నామని, తెలిపారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ జోన్ అధ్యక్షులు కుర్రె చక్రవర్తి, నస్పూర్ జోన్ ప్రధాన కార్యదర్శి మద్ది సుమన్ యాదవ్, రెడ్డిమల్ల అశోక్, పచ్చ వెంకటేశ్వర్, ముద్దం మల్లేష్, సిపాతి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



**బెల్లంపల్లి, డిసెంబర్ 03, ప్రభాతవార్త**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు జిల్లా అధ్యక్షుడు నగనూరి వెంకటేశ్వర గౌడ్ సూచన మేరకు బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు దార కళ్యాణి ఆధ్వర్యంలో బెల్లంపల్లి కొత్త బస్టాండ్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ జిల్లా ఉపాధ్యక్షులు కోడి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువుల పట్ల రేవంత్ రెడ్డి బ్రహ్మచారులకి ఒక దేవుడు, ఇద్దరూ భార్యలు ఉన్నవారికి ఒక దేవుడు, హిందువులకు మాత్రమే ముక్కోటి దేవుళ్ళు అని అనుచిత వ్యాఖ్యలు చేయడానికి భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. హిందువులు ఓట్లు వేసి గెలిపించినందుకే హిందూ దేవతలను అవమానిస్తూ మాట్లాడుతున్నావా రేవంత్ రెడ్డి అని అన్నారు. హిందూ దేవి దేవతలను అవమానిస్తే ఊరుకునేది లేదు కావున హిందువులకు చిత్తశుద్ధి ఉంటే రాబోయే సర్పంచ్ ఎన్నికలలో ఈ హిందూ ద్రోహికి తగిన గుణ పాఠం చెబుతూ కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించి మరీ బుద్ధి చెప్తారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు శనిగారపు శ్రావణ్, సీనియర్ నాయకులు దూది ప్రకాష్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కోడి సురేష్, కళ్ళేపల్లి నవీన్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎరుకల నర్సింగ్, మహిళా మోర్చా జిల్లా నాయకులు నల్లుల సంగీత, పట్టణ ఉపాధ్యక్షులు సల్లం సుమలత, ఎర్రోజు శ్రీనివాస్, చింతకింది లావణ్య, రాజేశ్వరి, కోదాటి కళావతి, సోషల్ మీడియా కన్వీనర్ తోటపల్లి ఓం సాయి హరీష్, అల్లకాటి మహేష్, షేక్ గౌస్ బాబా, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## సిర్పూర్ మండల కేంద్రంలో పోలీసుల ర్యాలీ

**సిర్పూర్(టి) డిసెంబర్ 3 ప్రభాతవార్త**

గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం రోజున మండల కేంద్రంలో డిఎస్పి వహీదుద్దీన్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ నుండి డౌనల్ వరకు పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పోలీసులు తెలిపారు . ఎన్నికల సమయంలో గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనబడితే సమాచారం ఇవ్వాలని సీఐ సంతోష్ అన్నారు. ఈ ర్యాలీలో సిర్పూర్ ఎస్సై సురేష్ కుమార్ కౌటాల ఎస్సై చంద్రశేఖర్ చింతలమానపల్లి ఎస్సై నరేష్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



సిర్పూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

## ఇందారం చెక్‌పోస్ట్‌ను పరిశీలించిన అధికారుల బృందం

**జైపూర్, డిసెంబర్ 03, ప్రభాత వార్త**

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇందారం గ్రామం లో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌ను బుధవారం మండల అధికారుల బృందం పరిశీలించారు. అనంతరం మండలంలోని ఐదు క్లస్టర్‌లు జైపూర్, మిట్టపల్లి, ఇందారం, శెట్‌పల్లి, వేలాల నామినేషన్ కేంద్రాలను సందర్శించారు. నామినేషన్ కేంద్రాలలో నోటీస్ బోర్డులపై ఫారం1 పత్రాలను అంటించారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, తహశీల్దార్ వనజ, ఆర్.డబ్ల్యూ.ఎస్ డీ.ఈ విద్యాసాగర్, ఎంపీవో శ్రీపతి బాపు రావులు పాల్గొన్నారు.



చెక్‌పోస్ట్‌ను పరిశీలిస్తున్న మండల అధికారులు



విద్యార్థుల తల్లిదండ్రులకు అవగహన కల్పిస్తున్న పోలీసులు

## సైబర్ మోసాలపై పోలీసుల చైతన్యం

**పెంచికల్ పేట్, డిసెంబర్ 03, ప్రభాతవార్త :**

పెంచికల్ పేట్ మండలంలోని ఎల్కపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థుల తల్లిదండ్రులతో అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు ఉపయోగించే మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా ప్లాట్ ఫారమ్ లు, ఆన్లైన్ గేమ్స్ ద్వారా పిల్లలు ఎలా మోసపోవచ్చో, ఏ విధంగా కట్టడి చేయాలో వివరించారు. అపరిచితుల నుండి వచ్చే లింకులు, సందేశాలు, కాల్స్‌ను నమ్మవద్దని సూచించారు. పిల్లల మొబైల్ వినియోగంపై తల్లిదండ్రులు పర్యవేక్షణ పెంచాలని వివరించారు. ఓటీపీ మోసాలు, బ్యాంక్ సంబంధిత ఆన్లైన్ మోసాల గురించి కూడా స్పష్టమైన అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది శ్యామ్, సుధాకర్, వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ముగిసిన 2వ విడత నామినేషన్ ప్రక్రియ

**సారంగాపూర్, డిసెంబర్ 02, ప్రభాతవార్త:**

మండలంలో రెండవ విడత స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియ నవంబర్ 30న ప్రారంభమై డిసెంబర్ 02 రాత్రితో ముగిసింది. మొత్తం మండలాన్ని ఎనిమిది క్లస్టర్లుగా విభజించి, సంబంధిత గ్రామాలను కలుపుకొని నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలోని 32 గ్రామాల సర్పంచ్ స్థానాలకు 176 నామినేషన్లు వచ్చాయి. అదే విధంగా 282 వార్డు సభ్యుల స్థానాలకు 533 నామినేషన్లు స్వీకరించినట్లు అధికారులు వెల్లడించారు. నామినేషన్ పత్రాల పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ పూర్తయ్యాక, ఉపసంహరణకు డిసెంబర్ 06 చివరి తేదీగా నిర్ణయించారు. ఉపసంహరణ ప్రక్రియ పూర్తయ్యాక సర్పంచ్, వార్డు సభ్యుల పోటీలో నిలిచిన అభ్యర్థుల పూర్తి వివరాలు డిసెంబర్ 06 సాయంత్రం 3 గంటలకు ప్రకటిస్తామని ఎంపీడీవో లక్ష్మీకాంత్ తెలిపారు.

**పెంచికల్ పేట్, డిసెంబర్ 3, ప్రభాతవార్త:**

సర్పంచ్ నామినేషన్ల ప్రక్రియ ముగిసింది మండలంలో చెడ్వాయి, ఎల్కపల్లి, లోడ్ పల్లి, కమ్మర్గం గ్రామంలో నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 12 గ్రామ పంచాయతీ సర్పంచులకు 92 మంది అభ్యర్థులు, 102 వార్డ్స్‌కు 237 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లుగా ఎన్నికల అధికారి ఆల్బర్ట్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ శాంతియుతంగా సాగేందుకు ఎన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

## జిన్నింగ్ మిల్లులను సందర్శించిన బిజెపి నాయకులు

**తాండూర్, డిసెంబర్ 3, ప్రభాతవార్త**

మండలంలోని రేపల్లెవాడ వద్ద గల జిన్నింగ్ మిల్లులను బుధవారం బిజెపి నాయకులు సందర్శించారు. సీసీఐ ఆధ్వర్యంలో రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న పత్తిని నాయకులు పరిశీలించారు. రైతులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కౌలు రైతుల సమస్యలను వ్యవసాయ శాఖ అధికారులు పరిగణలోకి తీసుకొని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యాల ఏమాజీ, మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణ దేవరాయలు, నాయకులు పులగం తిరుపతి, శేషగిరి, పుట్ట కుమార్, శ్రావణ్, ఏముర్ల ప్రదీప్, నర్సింగ్, కొండ రవి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



పత్తిని పరిశీలిస్తున్న బిజెపి నాయకులు

## ప్రతిభకు ప్రతిబంధకాలు లేవు..

### - ఎల్కపల్లి పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

**పెంచికల్ పేట్, డిసెంబర్ 03, ప్రభాతవార్త:**

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండలంలోని ఎల్కపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగవైకల్యం కలిగిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని పిల్లల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య తిథులుగా హాజరైన తహసీల్దార్ తిరుపతి ఎంపిడిఓ ఆల్బర్ట్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు విజయ నిర్మల, సిఆర్పి శ్యామ్ సుందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన అధికారులు అంగవైకల్యం కలిగిన పిల్లలకు సమన అవకాశాలు కల్పించడం ప్రతి విద్యాసంస్థ బాధ్యత అని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రతిభను వెలికి తీయడానికి కృషి చేయాలనీ సూచించారు. పాఠశాల నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా సమాజంలో అంగవైకల్యం పట్ల అవగాహనను పెంచిందని అన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులతో అధికారులు

## ఎన్నికల నిర్వహణలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి

### - ఎన్నికల పరిశీలకులు మనోహర్

**జైపూర్, డిసెంబర్ 03, ప్రభాతవార్త**

ఎన్నికల నిర్వహణలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఎన్నికల పరిశీలకులు మనోహర్ అన్నారు. బుధవారం జైపూర్ మండలంలో ఏర్పాటు చేసిన జైపూర్, ఇందారం, శెట్‌పల్లి నామినేషన్ కేంద్రలను సందర్శించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైనవని, ప్రతి ఆర్.ఓ, ఏ.ఆర్.ఓ తమకు కేటాయించిన విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి. సత్యనారాయణ, తహసీల్దార్ వనజ, ఎంపీవో శ్రీపతి బాపు రావు ఆర్ఓ ప్రసాద్, ఏ.ఆర్.ఓ సత్తయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



ఇందారం గ్రామ పంచాయతీలో ఎన్నికల పరిశీలకులు మనోహర్

## పత్తి పంట మొత్తం కొనాలి

### - బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజి

**తాండూర్, ప్రభాతవార్త :**



ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన పత్తి పంటను పూర్తిగా కొనుగోలు చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జడ్పీటీసీ ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కొయ్యల ఏమాజి డిమాండ్ చేశారు. మండలంలోని జిన్నింగ్ మిల్లులను బుధవారం బిజెపి నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. వ్యవసాయ శాఖ అధికారులు కౌలు రైతుల పంటను ఎకరానికి నాలుగు క్వింటాలు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, తేమ పేరుతో ధరలో కోత విధిస్తున్నారని రైతులు బిజెపి నాయకుల దృష్టికి తెచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన ఆశించిన పత్తి దిగుబడి రాక పెట్టిన పెట్టుబడి కూడా వెళ్లక రైతులు తీవ్రంగా నష్ట పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల మొత్తం పంటను కొనుగోలు చేయాలని, కౌలు రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పులగం తిరుపతి, శేషగిరి, మండల అధ్యక్షులు భరత్ కుమార్, శ్రీకృష్ణ దేవరాయులు, పుట్ట కుమార్, శ్రవణ్ కుమార్, నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు



# ఘనంగా ప్రపంచ దివ్యాంగ దినోత్సవం

**బెజ్జూర్, డిసెంబర్ 3, ప్రభాతవార్త :**

బెజ్జూర్ మండల కేంద్రంలో బుధవారం ప్రపంచ దివ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఐఆర్పీ ఎంపీపీఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు రాథోడ్ జ్యోతి విద్యార్థులచే కేక్ కట్ చేయించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, సిఆర్పీ శ్రీనివాస్, ఐఆర్పీ రజిత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**సారంగాపూర్, డిసెంబర్ 03, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ అభిలాష అభినవ్, అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ముఖ్య అధితులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో విద్య, క్రీడలు సహా అన్ని రంగాల్లో ముందుకు సాగాలని సూచించారు. దివ్యాంగుల కోసం అందుబాటులో ఉన్న సబ్సిడీ రుణాలు, సంఘాల ఏర్పాటు వంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా దివ్యాంగుల సంక్షేమ సేవలందిస్తున్న తాంద్ర గ్రామానికి చెందిన జిల్లా ప్రధాన కార్యదర్శి సాక్ పెల్లి సురేందర్‌కు ఉత్తమ సేవల అవార్డును కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో డిఆర్డిఓ పీడీ విజయలక్ష్మి ్మ, జడ్జ్ రాధిక, డీఈఓ భోజన, జిల్లా ఇంచార్జ్ రవికాంత్, దివ్యాంగుల సంఘ అధ్యక్షుడు సట్టి సాయన్న, మురళీ, రియాజ్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

### సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో..

**బెల్లంపల్లి, డిసెంబర్ 03, ప్రభాతవార్త**



సింగరేణి సంస్థ ఆద్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను బుధవారం గోలేటిలోని సిఈఆర్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. భీమిని, బెల్లంపల్లి, తాండూర్, గోలేటి నుండి వచ్చిన దివ్యాంగ చిన్నారులకు ఉదయం క్రీడాపోటీలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమానికి ఇంచార్జి జిఎం మచ్చగిరి నరేందర్ ముఖ్య అతిధిగా హాజరై క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు సకలాంగుల కన్నా చురుకైన అతీత శక్తి ఉంటుందన్నారు. ప్రపంచంలో పలు రంగాల్లో రాణిస్తున్న దివ్యాంగుల గురించి వివరించారు. దివ్యాంగులకు సేవ చేస్తున్న తల్లుదండ్రులు గౌరవనీయులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి, అధికారుల సంఘం ప్రతినిధి ఉజ్వల్ కుమార్ బెహరా, ఎస్ఓటు జిఎం కె. రాజమల్లు, పర్సనల్ డిపార్ట్మెంట్ హెచ్ఓడి ఎం. శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, ఉపాధ్యాయులు సుజాత, ఆర్. వెంకటేశ్వర్లు, సుచిత్ర, రేష్మా, సతీష్ వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**బజార్‌హత్నూర్, డిసెంబర్ 03, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులచే ప్రధాన విధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ భగత్ రాం కిషన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భగత్ రాం కిషన్, ప్రధానోపాధ్యాయులు జే భూమన్న, ఉపాధ్యాయులు, భగత్ బాపురావు, రమేష్, శ్రీనివాస్, చందన్ బాబు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# మైక్రో అబ్జర్వర్లు తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలి

### - గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం

**నిర్మల్ పట్టణం, డిసెంబర్ 3, ప్రభాతవార్త**

సూక్ష్మ పరిశీలకులు (మైక్రో అబ్జర్వర్లు) తమ ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం అన్నారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ ఎన్నిక విధుల్లో పాల్గొనబోయే సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనరల్ అబ్జర్వర్ అయేషా మస్రత్ ఖానం, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ, మైక్రో అబ్జర్వర్లుగా విధులు నిర్వహించబోయే అధికారులకు ముందుగానే సమాచారం అందించామని అన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్ ఓటు విధానాన్ని వినియోగించుకొని తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని అన్నారు. శిక్షకులు అందించిన సమాచారాన్ని తూచా తప్పకుండా పాటిస్తూ, ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని వివరించారు.

### పంచాయితీ ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

**- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

పంచాయతీ ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సూక్ష్మ పరిశీలకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా, ఎన్నికకు ముందు, ఎన్నిక సమయంలో, ఎన్నిక తర్వాత, ఓట్ల లెక్కింపు సమయంలో అనుసరించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. సమయానుసారం ఓటింగ్ నమోదు వివరాలను పైఅధికారులకు ఎప్పటికప్పుడు అందజేయాలని అన్నారు. మైక్రో అబ్జర్వర్లకు అందించిన కరదీపికలను అనుసరించాలని చెప్పారు. ఎటువంటి సందేహాలు ఉన్న పై అధికారులను సంప్రదించాలని సూచించారు. రెండో దశలో భాగంగా మరోసారి సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ అందిస్తామని అన్నారు. ఎన్నికల నిర్వహణలో నిర్దేశించిన అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నమోదు చేయాలని తెలిపారు. పలువురు శిక్షకులు మైక్రో అబ్జర్వర్లకు తమ ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో డిపిఓ శ్రీనివాస్, డీఈవో భోజన్న, ఎల్డీఎం రామ్ గోపాల్, శిక్షకులు, మైక్రో అబ్జర్వర్లు, తదితరులు పాల్గొన్నారు.





## నేరడిగొండలో సుదర్శన్‌రెడ్డికి ఘన స్వాగతం

**నేరడిగొండ, డిసెంబర్ 03, ప్రభాతవార్త:**

అదిలాబాద్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి రేపటి పర్యటనకు సంబంధించి మండలాల కీలక నేతలతో సమావేశం కావడానికి వచ్చిన తెలంగాణ ప్రభుత్వ సలహాదారు పొద్దుటూరు సుదర్శన్ రెడ్డిని నేరడిగొండ పట్టణ కేంద్రంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ స్వాగతం పలికారు.



## కౌట్ల(బి)లో భక్తి పర్వంగా పడిపూజ

**సారంగాపూర్, డిసెంబర్ 03, ప్రభాతవార్త:**

మండలంలోని కౌట్ల(బి) గ్రామంలో సోమిరెడ్డి అఖిలేష్ రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కన్నె స్వాములకు భిక్ష ఇవ్వడంతో పాటు పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బ్రహ్మశ్రీ కంచర్ల శివ శంకరాచార్యులు పూజా విధులను నిర్వహించారు. యజ్ఞ కార్యక్రమాలు, స్వామివారికి అర్చన, హారతులతో ఆలయం భక్తి వాతావరణంతో కళకళలాడింది. అయ్యప్ప భక్తులు స్వామి కీర్తనలు ఆలపిస్తూ భక్తి పరవశంలో పాల్గొన్నారు. నిర్మల్ జిల్లా సహా పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన అయ్యప్ప స్వాములు శ్రద్ధ, భక్తులతో పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భిక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని స్వామి బంధువర్గం సహా స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## మామిడిపల్లి గ్రామపంచాయతీలో ఏకగ్రీవమైన సర్పంచ్ ఎన్నిక

**లింగాపూర్, డిసెంబర్ 3, ప్రభాతవార్త :**

లింగాపూర్ మండలంలోని మామిడిపల్లి గ్రామపంచాయతీలో మామిడిపల్లి, వంజారిగూడ, నడుంగుడా, గీత బండ, గ్రామస్తులు సమావేశమై, మామిడిపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ గా మడవి మారుబాయి భీమ్రావు, ఉప సర్పంచ్ గా కేంద్రే నాతారావు లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది, ఈ సందర్భంగా సర్పంచ్ గా ఎన్నుకోబడ్డ మడవి మారుబాయి భీమ్రావు మాట్లాడుతూ, నాపై ప్రజలు పెట్టిన బరువు బాధ్యతలను స్వీకరిస్తూ ప్రజలు నాకిచ్చిన అవకాశాన్ని ఉపయోగిస్తూ అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉండి మా గ్రామ పంచాయతీని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తూ, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను మా గ్రామ పంచాయతీ ప్రజలకు, ప్రతి కుటుంబానికి చేరే విధంగా సాయసక్తుల శ్రమించి అభివృద్ధి పరుస్తానని నాపై నమ్మకం ఉంచినా గ్రామ పంచాయతీ మామిడిపల్లి ప్రజానీకానికి రుణపడి ఉంటానని తెలిపారు.



ఏకగ్రీవమైన సర్పంచ్, ఉప సర్పంచ్ లతో సంబరాలు జరుపుకుంటున్న మామిడిపల్లి ప్రజలు

# ఓసీ ఫేస్-2పై శాంతి కాలనీ వాసుల తీవ్ర ఆందోళన

- ఫేస్-I కాలుష్యంతోనే ఆరోగ్యం దెబ్బతిన్నామని కాలనీవాసుల ఆవేదన - ఫేస్-2 మొదలైతే పరిస్థితి మరింత దారుణం అవుతుందని ఆందోళన
- చెరువులు పూడి పోయాయని మత్స్యకారుల సంఘం గళమెత్తిన నాయకులు - ప్రతి సమస్యను నోట్ చేశామని జీఎం రాధాకృష్ణ భరోసా




సమస్యలపై మాట్లాడుతున్న ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ



ప్రజా అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న కాలనీవాసులు

**రామకృష్ణాపూర్, డిసెంబర్ 3, ప్రభాతవార్త**

ఆర్కేపీ ఓపెన్‌కాస్ట్ ఫేస్–2 ప్రాజెక్టుకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో స్థానిక ప్రజలు భారీగా పాల్గొని తమ సమస్యలు, ఆందోళనలు వెల్లడించారు. ఫేస్–1 కార్యకలాపాల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ఆర్కే–4 గడ్డ శాంతి కాలనీ వాసులు, కాలుష్యం కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు తెచ్చిపెట్టాయని, ఫేస్–2 ప్రారంభమైతే సమస్యలు మరింత తీవ్రమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థ పర్యావరణ నిబంధనలను కఠినంగా అమలు చేసి ప్రజల ఆరోగ్యాన్ని రక్షించాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ స్థలంలో నివాస సదుపాయాలు కల్పించాలంటూ విన్నవించారు. అలాగే ఫేస్–1 సమయంలో చెరువులు పూడుకుపోయినా పునరుద్ధరణ కోసం చేసిన విజ్ఞప్తులను అధికారులు పట్టించుకోలేదని మత్స్యకారుల సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేస్–2 కార్యకలాపాలతో చెరువులు పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉన్నందున వెంటనే చర్యలు తీసుకుని పునరుద్ధరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇక ప్రజల తరఫున పలువురు నాయకులు పట్టణంలో పెద్ద కమ్యూనిటీ హాల్ నిర్మాణం, ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య శిబిరాల ఏర్పాటు, రోడ్లు–డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, యువత కోసం స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాల నిర్వహణ వంటి పలు అభ్యర్థనలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ, ప్రజలు వ్యక్తపరిచిన ప్రతి అంశాన్ని నోట్ చేసుకున్నామని తెలిపారు. సిఎస్ఆర్ నిధులు ఇప్పటికే వినియోగమయ్యాయని, అయితే ఇరిగేషన్ శాఖ ఈ డిసెంబరు నుంచే పనులు ప్రారంభిస్తుందని చెప్పారు. అమరావతి ట్యాంక్ పునరుద్ధరణ పనులు జనవరి–ఫిబ్రవరిలో పూర్తవుతాయని వెల్లడించారు. అలాగే మంత్రివర్యుల ఆదేశాల మేరకు ఐదు ఎకరాలను స్మశానవాటిక కోసం కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ లక్ష్మణ్, సింగరేణి ఏరియా అధికారులు, ఎంఆర్ఓ సతీష్ కుమార్, మాజీ వార్డు కౌన్సిలర్లు, కార్మిక సంఘాల నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




జర్నలిస్టుల మహాధర్నాలో పాల్గొన్న టీయూడబ్ల్యూజే నాయకులు

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

**ఆసిఫాబాద్, డిసెంబర్ 3, ప్రభాతవార్త:**

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం ( టియూడబ్ల్యూజే ఐజేయూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ లోని పౌర సమాచార కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన జర్నలిస్టుల మహా ధర్నాలో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని జర్నలిస్టుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ నాయకుల దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లాలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర నాయకత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామనారాయణ, ఐజేయు సీనియర్ నాయకులు నగునూరి శేఖర్ హామీ ఇచ్చినట్లు జిల్లా నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ జమిల్, ఆసిఫాబాద్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీనివాస్ రావు, టీయూడబ్ల్యూజే (ఐజేయు) నాయకులు సురేష్ చారి, రాధాకృష్ణ చారి పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

## ఈస్గాం శివమల్లన్న స్వామి దేవాలయంలో షష్టిబోనాలు

**- బోనం సమర్పించి మొక్కలు చెల్లించిన భక్తులు**

**కాగజ్‌నగర్ రూరల్, డిసెంబర్ 3 ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలం ఈస్గాం గ్రామంలోని శ్రీ శివ మల్లన్న స్వామి దేవాలయంలో మార్గశిర మాసం షష్టి బోనాలు కొనసాగుతున్నాయి. షష్టిబోనాల సందర్భంగా రెండో బుధవారం భక్తులు కుటుంబ సమేతంగా దేవాలయానికి ఇచ్చి దేవాలయ పరిసర ప్రాంతంలో కొత్త బియ్యము, బెల్లముతో నైవేద్యం తయారు చేసుకుని స్వామివారికి బోనం సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు త్రాగునీటి సౌకర్యము, తాత్కాలిక వసతి దర్శనార్థం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వేణుగోపాల్ గుప్తా తెలిపారు. ప్రైమరీ హెల్త్ సెంటర్ ఈస్గాం ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సిఐ కుమారస్వామి ఆదేశాల మేరకు ఈస్గాం ఎస్సై కళ్యాణ్ ,పట్టణ ఎస్సై గాడి లక్ష్మణ్ పర్యవేక్షణలో ట్రాఫిక్ కంట్రోల్, భద్రత చర్యలు, పోలీసు బందోబస్తుఏర్పాటు చేశారు. ఈస్గాం గ్రామపంచాయతీ కాగజ్నగర్ పట్టణ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో త్రాగునీటి సౌకర్యం కోసం వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసినారు. శివ మల్లన్న సేవాసమితి ఈస్గాం గ్రామం సేవకులు, శ్రీ అరుణోదయ విద్యాలయం కాగజ్‌నగర్ విద్యార్థులు విచ్చేసిన భక్తులకు దర్శన సౌకర్యార్థము ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా క్యూలైన్ల క్రమబద్ధీకరణ, త్రాగునీటి సరఫరా సేవలను అందించారు.



ఆలయ ఆవరణలో బోనం తయారు చేస్తున్న భక్తులు

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**ఆసిఫాబాద్, డిసెంబర్ 3, ప్రభాతవార్త:**

జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పని చేయాలని జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి దీపక్ తివారి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన రహదారులు, వంతెనలు, కల్వర్టులు, పాఠశాల భవనాలు, అదనపు గదులు, అంగన్వాడి భవనాలు, గ్రామపంచాయతీ కార్యాలయ భవనాలు, ప్రధానమంత్రి జన్ మన్, జుగా పథకాల కింద చేపట్టిన పనులను వేగవంతం చేయాలని తెలిపారు. వివిధ గ్రాంటల కింద మంజూరైన అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ, సమగ్ర శిక్ష అభియాన్ క్రింద మంజూరైన పాఠశాల భవనాలు, అదనపు గదుల నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన పనులను త్వరగా పూర్తి చేసి విద్యార్థుల కొరకు వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. నిర్మాణాలలో పూర్తి నాణ్యత పాటించాలని, పనుల నిర్వహణలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, 15వ ఆర్థిక ప్రణాళిక క్రింద మంజూరైన నిధులను ఎంపిక చేయబడిన పనులకు మాత్రమే వినియోగించాలని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో లేబర్ కాంపోనెంట్ ను ఉపయోగించుకోవాలని, ఆకాంక్షిత తిర్యాణి బ్లాక్ లో చేపట్టిన అభివృద్ధి పనుల లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, అన్ని విభాగాల ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి దీపక్ తివారి



## దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక చర్యలు

**- ఐటిడిఏ పిఓ యువరాజ్ మర్మాట్**

**ఉట్నూర్, డిసెంబర్ 3, ప్రభాతవార్త:**

దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని ఉట్నూర్‌లోని వికాసం ప్రత్యేక పాఠశాల ఆధ్వర్యంలో కొమురం భీమ్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. దివ్యాంగుల అవసరాల దృష్ట్యా వారికి కావలసిన సహాయ ఉపకరణాలు, దివ్యంగ పిల్లలకు కావలసిన సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల కొరకు ఉపాధ్యాయులను నియమించి మంచి బోధన అందించే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. వికాసం ప్రత్యేక పాఠశాలను 10వ తరగతి వరకు ఆధునికరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ డిడి అంబాజీ జాదవ్, ఉట్నూర్ ఎటిడిఓ సదానందం, ఆదిలాబాద్ ఎటిడిఓ నిహారిక, బోథ్ ఎటిడిఓ, ఎసిఎంఓ జగన్, ఐటీడీఏ బిఈడి కళాశాల ప్రిన్సిపాల్ రాథోడ్ మాణిక్‌రావు, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వికాసం ప్రత్యేక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాథోడ్ వికాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మంచినీటి సరఫరాలో సింగరేణి యాజమాన్యం వైఫల్యం

**- కాంట్రాక్టర్ల లబ్ధి కోసమే పంపులు తొలగించారు**

**- టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి**

**నస్పూర్, డిసెంబర్ 3, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ ఏరియాలోని కార్మికుల కాలనీలకు, మందమర్రి, రామకృష్ణాపూర్ ఏరియాలకు గోదావరి రక్షిత మంచినీటిని సరఫరా చేయడంలో సింగరేణి యాజమాన్యం పూర్తిగా విఫలమైందని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి మండిపడ్డారు. గురువారం నాడు టీబీజీకేఎస్ నాయకులు శ్రీరాంపూర్ ఏరియాలోని గోదావరి ఇంటెక్‌వెల్, పంప్‌హౌస్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి మాట్లాడుతూ గత మూడు రోజుల నుండి శ్రీరాంపూర్, ఆర్.కె 8, ఆర్.కె 6 కాలనీలు, గాంధీనగర్, కృష్ణ కాలనీ, ఆర్.కె 6 గుడిసెలు ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోయి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నస్పూర్, గోదావరి కాలనీ, నాగార్జున కాలనీ, సిసిసి టౌన్‌షిప్‌లలో కూడా ఇదే దుస్థితి నెలకొందని తెలిపారు. డిసెంబర్ నెలలోనే నీటి ఎద్దడి తలెత్తడం యాజమాన్య వైఫల్యానికి నిదర్శనమన్నారు. సివిల్ డిపార్ట్‌మెంట్‌లో పర్మినెంట్ ఉద్యోగులను తగ్గించి, కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకే యాజమాన్యం ఇంటెక్‌వెల్‌ను బంద్ చేసి, మోటార్లను తొలగించిందని ఆరోపించారు. గోదావరి పంప్‌హౌస్‌లో 190 హెచ్‌పి సామర్థ్యం గల ఆరు పంపులు ఉండగా, కేవలం రెండు పంపులతో నీటిని తోడటం వల్లే నీటి కొరత ఏర్పడిందని తెలిపారు. యాజమాన్యం సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టి నిధుల ద్వారా సింగరేణికి సంబంధం లేని పనులకు, యూనివర్సిటీలకు, ఫర్నిచర్‌కి కోట్లు ఖర్చు చేస్తోందని, కానీ సొంత కార్మికులకు మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. సంక్షేమం పేరుతో ఎల్ఈడి స్క్రీన్‌లు, కరపత్రాల ప్రచారానికే పరిమితమయ్యారని ధ్వజమెత్తారు. తక్షణమే గోదావరి రక్షిత మంచినీటి సరఫరా పునరుద్ధరించాలని, గతంలో కోట్లు వెచ్చించి నిర్మించిన ఇంటెక్‌వెల్ ఫిల్టర్ బెడ్‌ను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. సివిల్ డిపార్ట్‌మెంట్‌లో సిబ్బందిని పెంచి, భవిష్యత్తులో వేసవి కాలం దృష్ట్యా నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో కార్మికుల కుటుంబాలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షులు బండి రమేష్, కేంద్ర సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పొగాకు రమేష్, ఏరియా కార్యదర్శి గడ్డం మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గోదావరిని పరిశీలిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు





## శ్రీరాంపూర్‌లో 8న అయ్యప్ప మహా సంగమం

**- వాల్ పోస్టర్ ఆవిష్కరించిన జీఎం శ్రీనివాస్**

**- కేరళ గురుస్వామిచే ప్రత్యేక పూజలు**


**నస్పూర్, డిసెంబర్ 3, ప్రభాతవార్త**

లోక కళ్యాణార్థం శ్రీరాంపూర్‌లోని ప్రగతి స్టేడియంలో ఈ నెల 8న అయ్యప్ప స్వాముల మహా సంగమం, మహా పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అచల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ శ్రీరాంపూర్ శాఖ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను బుధవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీఎం శ్రీనివాస్, సంఘం అధ్యక్షులు బొడ్డు లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వంగ శివ కుమార్, ప్రధాన కార్యదర్శి భాస్కరి రాజేశం మాట్లాడుతూ.. ఈ నెల 8న సాయంత్రం 6 గంటలకు కేరళకు చెందిన ప్రముఖ గురుస్వామి బ్రహ్మశ్రీ సంజీవ నంభూద్రి చేతుల మీదుగా అయ్యప్ప స్వామి మహా మండల పడిపూజ, అనంతరం అయ్యప్ప స్వాములచే అగ్ని ప్రవేశం (అగ్ని గుండాలు) కార్యక్రమం అత్యంత వైభవంగా జరుగుతుందని తెలిపారు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు ఆర్కే8 కాలనీలోని విఘ్నేశ్వర ఆలయం నుండి భారీ శోభాయాత్ర ప్రారంభమవుతుంది. ఇందులో 108 మంది మహిళలు హారతులతో, అయ్యప్ప భక్తుల పేటతుల్లి నృత్యాలు, నగర సంకీర్తనలతో.. అయ్యప్ప, గణపతి, కుమారస్వామిల చిత్రపటాలతో ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ యాత్ర ఆర్కే6 గుడిసెలు, గాంధీనగర్, హిమ్మత్ నగర్ మీదుగా ప్రగతి స్టేడియం వరకు సాగుతుంది. మధ్యాహ్నం 1 గంటకు అయ్యప్ప స్వాములు, భక్తులకు భిక్షా (అన్నదానం) కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ జిల్లా స్థాయి మహా సంగమానికి ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్రలోని సిరివంచ నుండి కూడా వేలాదిగా అయ్యప్ప స్వాములు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో అచల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షులు చకిలం శ్రావణ్ చింటు, కార్యదర్శి పడాల లింగయ్య, దాసరి నవీన్, జమాల్ పూర్ శ్రావణ్, తళాల శివ, ఆనకారి హరీష్, ప్రసాద్, నాతాడి కొండాల్ రెడ్డి, దాసరి కళ్యాణ్, తాటిపాముల సత్యనారాయణ, జక్కెన రమేష్, ఎగ్గడి వినోద్ కుమార్, మాటూరి వంశీ, ఆడేటి అశోక్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

## నేను సైతం ప్రజాసేవకు

**సారంగాపూర్, డిసెంబర్03, ప్రభాతవార్త:**

**మండలం కౌట్ల-బి గ్రామపంచాయతీ 2వ వార్డులో వార్డు అభ్యర్థిగా దివ్యాంగుడైన బేడద శంకర్ బరిలో దిగారు. రెండు చేతులు లేకున్నా ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ప్రజాసేవలోకి అడుగుపెట్టడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. శంకర్ నామినేషన్ వేసిన వెంటనే గ్రామ ప్రజలు ఆయనను అభినందించి ప్రోత్సహించారు. దివ్యాంగులకు రాజకీయాల్లో కూడా అవకాశాలు లభించాలని, శంకర్ ముందుకు రావడం దివ్యాంగులకు ప్రేరణగా నిలుస్తుందని స్థానికులు తెలిపారు.**



## సెలవులు మంజూరు చేయాలని వినతి

**లక్షెట్టిపేట, డిసెంబర్ 03, ప్రభాతవార్త**

ప్రభుత్వ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సెలవులు మంజూరు చేయాలని పీఆర్టీయూ లక్షెట్టిపేట మండల అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతి, బండ రవీందర్ కోరారు. బుధవారం వారు లక్షెట్టిపేట ఎంఈఓ శైలజను కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం 2024లో నిర్వహించిన సామాజిక ఆర్థిక, ఉపాధి, కుల సర్వేలో చాలామంది ఉపాధ్యాయులు పాల్గొన్నారని, వారికి సెలవులు మంజూరు చేయాలన్నారు.

